
# ఈ-బైక్ సెగ్మెంట్‌లోకి ఓలా

### రోడ్‌స్టర్ ఎక్స్ మోటర్‌సైకిల్ విడుదల..ప్రారంభ ధర రూ.74,999

### సింగిల్ చార్జింగ్‌తో 501 కిలోమీటర్ల ప్రయాణం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా..తాజాగా ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌లో భాగంగా ఒకేసారి నాలుగు మాడళ్లను పరిచయం చేసింది. వీటిలో రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ బైకులు 2.5 కిలోవాట్లు, 3.5 కిలోవాట్లు, 4.5 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన బైకులు రూ.74,999, రూ.84,999, రూ.94,999 ధరతో లభించనున్నాయి. అలాగే రోడ్‌స్టర్ ఎక్స్+ మాడల్ 4.5 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ రూ.1,04,999, రోడ్‌స్టర్ ఎక్స్+ 9.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ రూ.1,54,999గా నిర్ణయించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ భావిష్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశీయ ఈవీ విభాగంలో చరిత్ర సృష్టించిన సంస్థ..ఈసారి బైకుల సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టినట్లు చెప్పారు.

**రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ బైకు ప్రత్యేకతలు..**

- వీటిలో రోడ్‌స్టర్ ఎక్స్+ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 501 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- కేవలం 2.7 సెకండ్లలో 40 కిమీ వేగాన్ని అందుకోనున్న ఈ బైకు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది.
- ఈ బైకులపై మూడేండ్లు లేదా 50 వేల కి.మీ. వరకు వ్యారంటీ కల్పిస్తున్నది.
- ముందస్తుగా ఈ బైకులు బుకింగ్ చేసుకున్నవారికి వచ్చే నెల చివరి నుంచి డెలివరీ చేయబోతున్నది.
- 4.3 ఇంచుల ఎల్‌సీడీ స్క్రీన్, మూవ్ ఆపరేటింగ్ సిస్టమ్ 5తో తీర్చిదిద్దింది.

# బంగారం దారెటు?

### ధరలు పెరుగుతాయా.. తగ్గుతాయా! • డైలమాలో కొనుగోలుదారులు
### ఇప్పటికే ఆల్‌టైమ్ హైలో రేట్లు • పెట్టుబడులపై నిపుణుల మాటేంటి..



*సుబ్రహ్మణ్యం కూతురు పెండ్లి ఖాయమైంది. అమ్మాయికి నగానట్రా కొనాలనుకున్నారు. కానీ పెరుగుతున్న ధరల్ని చూసి బెంబేలెత్తిపోతున్నారు.*

***ధనుష్ తన పిల్లల కోసం ఎంతో కొంత బంగారాన్ని కూడబెట్టాలనుకుంటున్నాడు. అయితే పరుగులు పెడుతున్న రేట్లతో సందిగ్ధంలో పడిపోయాడు.***

*స్వాతి తన సంపాదనతో ఓ నెక్లెస్ కొనాలనుకున్నది. మార్కెట్ పోకడను చూసి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. నిజానికి మనలో చాలామందిది ఇప్పుడిదే పరిస్థితి. అసలు బంగారం దారెటు? ధరలు పైకా, కిందికా? పెట్టుబడులు పెడితే కరెక్షన్ వస్తుందేమో? అన్న సందేహాలు మదిని తొలిచేస్తున్నాయి మరి.*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. రోజుకో రికార్డు స్థాయికి చేరుతూ ఆల్‌టైమ్ హైల్లోనే కదలాడుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం ఒక్కరోజే దేశంలోని ప్రధాన నగరాల్లో తులం వెయ్యి రూపాయలకుపైగా ఎగబాకింది. అయితే అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఢిల్లీ మార్కెట్ మూతబడగా.. హైదరాబాద్ మార్కెట్‌లో మాత్రం 10 గ్రాముల మేలిమి బంగారం విలువ ఎప్పుడూ లేనివిధంగా తొలిసారి రూ.87,000లను తాకడం గమనార్హం. పెండ్లిళ్ల సీజన్ కావడంతో రాబోయే రోజుల్లో ఇంకా పెరగవచ్చన్న సంకేతాలున్నాయి.

**ఏడాది ఆఖర్లో లక్షకు?**

రాబోయే రోజుల్లో బంగారం ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయంగా తులం లక్ష రూపాయలను తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తుండటం గమనార్హం. ఇక త్వరలో విడుదలయ్యే అమెరికా ఆర్థిక గణాంకాలతో ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయని పేర్కొంటున్నారు. ఇందులోభాగంగానే ఔన్స్ 3,000లకు వెళ్లే వీలుందంటున్నారు. ఇప్పటికే తొలిసారి 2,830 డాలర్లను అధిగమించింది. అయితే 2-3 నెలల్లో ధరలు తగ్గుముఖం పట్టవచ్చనీ చెప్తున్నారు. కానీ ఆ తర్వాత మాత్రం పెరుగుతూపోతాయని, ఈ క్రమంలోనే అక్టోబర్-డిసెంబర్‌లో భారతీయ విపణిలో రూ.95,000-1,00,000 మార్కును చేరడం ఖాయమనే అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

**పెట్టుబడులు పెడుతారా?**

దేశ, విదేశీ మార్కెట్లలో బంగారం ధరలు భారీగా పెరుగుతూపోతున్న నేపథ్యంలో పెట్టుబడులపై కూడా సగటు మదుపరి ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆభరణాల రూపంలో పుత్తడి కొంటే తరుగు, తయారీ చార్జీలతోపాటు నిల్వ చేసుకోవడం కూడా సమస్యగా మారుతున్నదని చెప్పక తప్పదు. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్లు ఉత్తమమని ఇన్వెస్టర్లకు మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రస్తుత ట్రెండ్ దృష్ట్యా పెద్ద మొత్తంలో ఈ పెట్టుబడులు ఉండకుండా జాగ్రత్త తీసుకోవడం కూడా ముఖ్యమేనని హితవు పలుకుతున్నారు. కానీ నిర్ణయం తీసుకునే ముందు అంతర్జాతీయ పరిణామాలను గమనించడం లాభదాయకమని సలహా ఇస్తున్నారు.



## హైదరాబాద్‌లో తులం 87,000

హైదరాబాద్ రిటైల్ మార్కెట్‌లో పసిడి ధరలు మునుపెన్నడూ లేనివిధంగా నమోదయ్యాయి. బుధవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ ఏకంగా రూ.87,000 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం రేటు సైతం రూ.78,900గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.1,000 పుంజుకోవడం గమనార్హం. మంగళవారం కూడా పుత్తడి ధరల్లో భారీ పెరుగుదలే కనిపించింది. దీంతో రెండు రోజుల్లోనే రూ.2వేలకుపైగా బంగారం రేటు ఎగిసినట్టైంది. మరోవైపు కిలో వెండి విలువ రూ.98,000గా ఉన్నట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. ఒక్కరోజే రూ.1,000 పుంజుకున్నది.

### ధరల పెరుగుదలకు కారణాలివే..

- **ద్రవ్యోల్బణం**

అమెరికాలోని ట్రంప్ సర్కారు చైనాపై 10 శాతం సుంకాలను విధించడం, కెనడా-మెక్సికోలపై 25 శాతం చొప్పున ప్రతిపాదించడం.. గ్లోబల్ మార్కెట్‌లో ద్రవ్యోల్బణానికి దారితీస్తున్నది. దీంతో మదుపరులు ఆ ప్రభావాన్ని తట్టుకొనేందుకు బంగారాన్ని రక్షణగా ఎంచుకుంటున్నారు. ఇక పెరుగుతున్న ధరలను కట్టడి చేసేందుకు ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఈ అంచనా కూడా గోల్డ్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నది.

- **సురక్షిత పెట్టుబడి సాధనం**

స్టాక్ మార్కెట్లలో నెలకొన్న ఒడిదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. బంగారంపై మరింత ఎక్కువగా పెట్టుబడులు పెడుతున్నారు. రాజకీయ, భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు సైతం గోల్డ్‌ను సురక్షిత పెట్టుబడి సాధనంగా మార్చేస్తున్నాయి. ఫలితంగా సహజంగానే డిమాండ్ పెరిగి రేట్లు పైపైకి వెళ్తున్నాయి.

- **సెంట్రల్ బ్యాంక్‌ల పసిడి కొనుగోళ్లు**

బంగారాన్ని ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నాయి. అమెరికాతో వాణిజ్య యుద్ధం సంకేతాల మధ్య చైనా తమ పసిడి నిల్వలను ఇంకా పెంచుకుంటూపోతున్నది. ఇది కూడా ధరల పెరుగుదలకు దారితీస్తున్నది.

- **డాలర్ ఇండెక్స్ కదలికలు**

అమెరికా డాలర్ ఇండెక్స్ ఇటీవలే 109 మార్కును దాటేసింది. దీని ప్రభావం బంగారంసహా అన్ని కమోడిటీ మార్కెట్లపై పడుతున్నది. మరోవైపు అంతర్జాతీయ మదుపరులు కూడా ఈక్విటీ, బాండ్ మార్కెట్లు క్రాష్ అవుతాయన్న భయాలతో గోల్డ్ వైపే చూస్తున్నారు.

- **వాణిజ్య యుద్ధం భయాలు**

అమెరికా తమపై విధించిన సుంకాలకు బదులుగా చైనా కూడా అగ్రరాజ్యం నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు వేసింది. ఈ ప్రతీకార సుంకాలు.. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న ఆందోళనల్ని కలిగిస్తున్నది. ఫలితంగా పెట్టుబడులన్నీ బంగారం వైపు క్యూ కడుతున్నాయి.

### భారతీయ గోల్డ్ డిమాండ్ 803 టన్నులు

*గత ఏడాది దేశంలో గోల్డ్ డిమాండ్ 802.8 టన్నులుగా ఉన్నట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) బుధవారం తెలియజేసింది. 2023తో పోల్చితే ఇది 5 శాతం పెరిగినట్టు పేర్కొన్నది. నాడు 761 టన్నులుగా నమోదైంది. కాగా, విలువపరంగా చూసినట్టైతే ఈ డిమాండ్ 2023లో రూ.3,92,000 కోట్లుగా ఉంటే.. 2024లో రూ.5,15,390 కోట్లకు పెరిగింది. ఇక ఈ ఏడాది డిమాండ్ 700-800 టన్నుల మేర ఉండొచ్చని కూడా తాజా రిపోర్టులో డబ్ల్యూజీసీ ఇండియా విభాగం ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ తెలిపారు. ప్రపంచ డిమాండ్ 4,974 టన్నులుగా ఉన్నది. సెంట్రల్ బ్యాంకులు 1044.6 టన్నుల బంగారం కొన్నాయి.*

# సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

### సెన్సెక్స్ 312, నిఫ్టీ 43 పాయింట్ల నష్టం

ముంబై, ఫిబ్రవరి 5: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. వాణిజ్య యుద్ధానికి తోడు ఈవారం చివర్లో రిజర్వుబ్యాంక్ తన తదుపరి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరులను అమ్మకాలవైపు నడిపించింది. ఇంట్రాడేలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 312.53 పాయింట్లు కోల్పోయి 78,271.28 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 42.95 పాయింట్లు కోల్పోయి 23,696.30 వద్ద నిలిచింది. 23,807 నుంచి 23,680 పాయింట్ల శ్రేణిలో కదలాడిన నిఫ్టీ చివరకు నష్టపోయింది. దేశీయ కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకోవడం మార్కెట్లో సెంటిమెంట్‌ను నిరాశపరిచింది. 30 షేర్ల ఇండెక్స్‌లో ఏషియన్ పెయింట్స్ అత్యధికంగా 3 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, నెస్లె, హెచ్‌యూఎల్, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, ఐటీసీ, జొమాటో,హెచ్‌సీఎల్ టెక్, కొటక్ బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. కానీ, అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. రంగాలవారీగా చూస్తే వడ్డీరేట్లకు సంబంధం ఉన్న రంగాల్లో షేర్లు కుదేలయ్యాయి. ముఖ్యంగా రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 1.66 శాతం కోల్పోగా, ఎఫ్‌ఎంసీజీ 1.42 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.21 శాతం, వాహన రంగ షేర్లు కూడా నష్టపోయాయి. అలాగే ఆయిల్ అండ్ గ్యాస్ 1.89 శాతం, సేవలు 1.59 శాతం, మెటల్ 1.55 శాతం, ఎనర్జీ 1.30 శాతం, హెల్త్‌కేర్ రంగ సూచీ 1.21 శాతం చొప్పున పెరిగాయి. ఈ నెల 7న ఆర్బీఐ తన తదుపరి పరపతి సమీక్షను ప్రకటించబోతున్నది.




# రూపాయికి తప్పని తిప్పలు

### { 39 పైసలు పడిపోయిన మారకం విలువ }

ముంబై, ఫిబ్రవరి 5: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులుపడ్డాయి. అంతర్జాతీయ వాణిజ్యయుద్ధానికి అమెరికా కాలు దువ్వనుండటంతో డాలర్ కరెన్సీ అనూహ్యంగా బలపడుతున్నది. దీంతో ఇతర కరెన్సీలు ఢీలా పడుతున్నాయి. దీంట్లోభాగంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బుధవారం ఒకే రోజు 36 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 87.43 వద్దకు జారుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం మరింత ముదురుతుండటంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. దీంతోపాటు రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా కరెన్సీ పతనానికి ప్రధాన కారణమన్నారు. 87.13 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 87.49 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరికి 36 పైసల నష్టపోయి 87.43 వద్ద నిలిచింది. మంగళవారం నాలుగు పైసలు కోలుకొని 87.07 వద్ద స్థిరపడింది. రూపాయి పతనంతో దేశీయ దిగుమతులకోసం అదనంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నది. దేశీయ వినిమయంలో 80 శాతం చమురు దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు రూపాయి పతనం అధికంగా చెల్లించాల్సి ఉంటుందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు.

# ఎల్‌ఐసీకి మరో జీఎస్టీ నోటీస్

- **రూ.105 కోట్ల డిమాండ్‌తో జారీ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) సంస్థకు ఏడేండ్లకుగాను 105.42 కోట్ల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) డిమాండ్ నోటీస్ జారీ అయ్యింది. ఆయా రాష్ర్టాల్లోని కార్యకలాపాలకు సంబంధించి పన్ను, దానిపై వడ్డీ, జరిమానాలతో కూడిన జీఎస్టీ నోటీస్ బుధవారం వచ్చినట్టు కంపెనీ పేర్కొన్నది. 2017-18 నుంచి 2023-24కు మధ్య కాలానికిగాను తాఖీదులందాయని స్టాక్ ఎక్స్చేంజీలకు ఎల్‌ఐసీ తెలియజేసింది. అయితే ఈ నోటీస్‌పై లక్నో అప్పీల్స్ కమిషనర్ ఎదుట అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఇదిలావుంటే 2017-18 నుంచి 2021-22కు మధ్య రూ.101.95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీస్ మంగళవారం కూడా ఒకటి అందింది.



పోలీసులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

### న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 5 : హనుమకొండలోని కేయూ జంక్షన్ వద్ద న్యాయవాది గంధం శివపై దాడి చేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డితో పాటు ఇతర పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనగందుల చంద్రరుషి మాట్లాడుతూ న్యాయవాది శివపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. స్నేహితుడి అంత్యక్రియలకు వెళ్లి వస్తున్న శివపై దాడికి పాల్పడిన పోలీసులపై కేసు నమోదు చేసి వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. న్యాయవాదులపై దాడుల నేప థ్యంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నక్క సిద్ధులు, బాలకిషన్ గౌడ్, మన్నె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 5: పురుగులమందు తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటిపల్లి మూలస్తంభం తండాకు చెందిన గుగులోత్ సురేశ్(39) కుటుంబ కలహాలతో జనవరి 28న పురుగులమందు తాగాడు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**తండాలో బాలుడు..**

మహబూబాబాద్ రూరల్: తల్లి మందలించిందని పురుగుల మందు తాగిన బాలుడు చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దర్గాతండా గ్రామపంచాయతీ రేగడిగూడెం తండాకు చెందిన కారం అర్జున్-లక్ష్మి దంపతుల కుమారుడు బద్రీనాథ్(13) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బాలుడు బడికి పోకుండా ఇంటి వద్దే తిరుగుతున్నాడు. తల్లి మందలించటంతో ఈనెల 1వ తేదీన పొలం వద్ద పురుగులమందు తాగాడు. స్థానికులు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : మెడికల్ కళాశాల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం ఇంజినీరింగ్ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి పనులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాప్యం చేయకుండా భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. ప్రస్తుతం కాలేజీ వసతి గృహంలో వైద్య విద్యార్థులకు తాగునీరు సరఫరా, విద్యుత్ సదుపాయం కల్పిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

### జాతర పనులు పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : మహాశివరాత్రి పురస్కరించుకుని జిల్లాలోని కురవి వీరభద్రస్వామి దేవస్థానంలో జాతర పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో కృష్ణవేణి అన్నారు. బుధవారం అధికారులతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు శ్రీనివాస్, జనార్దన్, గణేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# వివాదాలకు కేంద్రంగా పాలకుర్తి ఠాణా

- **వరుస ఘటనలతో అట్టడుగు వర్గాల ఆవేదన**
- **వరంగల్ సీపీ, ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని పలువురి విజ్ఞప్తి**

పాలకుర్తి, ఫిబ్రవరి 5: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నది. కొద్ది రోజులుగా వరుసగా జరుగుతున్న ఘటనలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్థానిక పోలీసులపై ఇంటలిజెన్స్, ఎస్‌బీ రిపోర్టులను ఉన్నతాధికారులకు సక్రమంగా ఇవ్వడం లేదని, ఇంటలిజెన్స్ వ్యవస్థ విఫలమైందని ఆరోపణలున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలే వస్తున్నా కొందరికి న్యాయం జరగడం లేదని తెలుస్తున్నది. అధికార పార్టీ నాయకులకు ఠాణా అడ్డగా మారడంతో సామాన్యులకు న్యాయం జరగడం లేదని పలువురు వాపోతున్నారు. గతేడాది అక్టోబర్ 18వ తేదీన కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీను భార్యభర్తల పంచాయితీలో పోలీసులు, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు మనస్తాపం చెంది ఠాణాలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ అక్టోబర్ 19వ తేదీన వరంగల్ ఎంజీఎం దవాఖానలో మృతి చెందాడు. నాలుగు నెలలు కాక ముందే పోలీసుల నిర్లక్ష్యంతో గిరిజన వృద్ధురాలు ఆగమ్మ సైతం రెండు రోజుల క్రితం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడడం చర్చనీయాంశమైంది. మొన్నటికి మొన్న మంచుప్పులలో మామ, కోడలు పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు రాగా ఎస్సై పట్టించుకోకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులను పరిష్కరించడంలో ఆలస్యం చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరిస్తే సమస్యలు ఉండవని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై వరంగల్ పోలీస్ కమిషనర్, ఉన్నతాధికారులు పరిశీలించి పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వరుస ఘటనలపై పరిశీలించాలని పలువురు సూచిస్తున్నారు.




పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్

### 'కేయూలో ఓఎస్డీ మల్లారెడ్డి తొలగించాలి'

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5: కాకతీయ యూనివర్సిటీలో ఓఎస్డీ పోస్టును వెంటనే రద్దు చేసి, మల్లారెడ్డిని తొలగించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కలకోట్ల సుమన్ డిమాండ్ చేశారు. కేయూలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓఎస్డీగా బాధ్యతలు చేపట్టిన మల్లారెడ్డి వెంటనే ఆయనకిచ్చిన ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రభు త్వాన్ని హెచ్చరించారు.

### లారీ ఢీకొని ఒకరి మృతి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5: లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన వరంగల్ 14వ డివిజన్ రెడ్డిపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఎనుమాముల సీఐ ఆలె రాఘవేందర్ కథనం ప్రకారం.. రెడ్డిపాలెం జంక్షన్ వద్ద గొర్రెకుంట నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న లారీ ముస్త్యాలపల్లి నుంచి కాశీబుగ్గ వైపు వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముస్త్యాలపల్లికి చెందిన సిద్దోజు సదానందం(55) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేర కు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సదానందం(ఫైల్)

# కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను ఆల్ ట్రేడ్ యూనియన్ ప్రజాసంఘాల నాయకులు దహనం చేశారు. వరంగల్‌చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఏఐసీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్రా ప్రతాప్, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి మాట్లాడు తూ ఇది కార్మిక, కర్షక, నిరుద్యోగుల వ్యతిరేక బడ్జె ట్ అన్నారు. దేశాన్ని సంపన్నులు, కార్పొరేట్ శక్తుల కు దోచిపెట్టేలా ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచుకుండా నట్టేట ముంచేలా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోత్ సాగర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, జాన్‌పాల్, రైతు సంఘం నాయకులు బాలరాజు, ఎగ్గె మల్లికార్జున్, మాలి ప్రభాకర్, అంకటి శ్యామ్ పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తా: బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

**'రైతులకు వ్యతిరేకంగా ఉన్న బడ్జెట్'**

కాశీబుగ్గ: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు వ్యతిరేకంగా ఉందని ఆరోపిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం కాశీబుగ్గ సౌరస్తాలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. అనంతరం మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాలరాజు, శ్రీనివాస్, సూరి, కుమారస్వామి, భాస్కర్, నగేశ్ పాల్గొన్నారు.

# క్రైం వింగ్ కానిస్టేబుల్‌కు ప్రశంసలు

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 5: మట్టెవాడ పోలీస్ స్టేష న్ క్రైం వింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ మీర్ అహ్మద్ అలీని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రశంసించారు. జాతీయ స్థాయి క్రైం విభాగా నికి అనుసంధానంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో అలీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు.కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, కొచ్చి, వికారాబాద్ ప్రాంతంలో దృష్టి మర ల్చి దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్ర ముఠాలను గుర్తించాడు. వా రిని పట్టుకోవడంలో అంతర్రాష్ట్ర పోలీసులకు సహకరిం చి సొత్తును పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అలీకి తిరువనంతపురం పోలీస్ కమిషనర్ కిరణ్ నారాయణన్, కొచ్చి సీపీ సుదర్శన్‌తోపాటు వికారాబాద్ ఎస్పీ నా రాయణరెడ్డి ప్రశంసాపత్రాలు పంపించారు. బుధవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా చేతులమీదుగా అలీ అందుకున్నాడు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ అలీ

### బీఆర్‌ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

*జనగామ మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి*

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 : పార్టీ బలోపేతం కోసం బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాటుపడాలని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలం లోని గానుగుపహాడ్, వెంకిర్యాల గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలతారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రైతుభరోసాలో నేటికీ పంట సాయం అందించలేదని, రూ.2 లక్షల పంట రుణమాఫీ సగం మందికే అమలైందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ వాగ్దానాలకే పరిమితమైందన్నారు. దీనిపై ప్రజలకు వివరించి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్లు మారబోయిన పాండు, సమద్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు ఎండీ పాషా, మాజీ సర్పంచులు కారింగుల రాంచంద్రారెడ్డి, గుర్రం కుమార్, కొర్ర కాల్‌రాం, బాలస్వామి, గ్రామ అధ్యక్షుడు తాళ్లపల్లి ఆశోక్, ఐలయ్య, నాయకులు సిద్ధులు, రాములు, సంతోష్, శంకర్‌నాయక్, కరుణాకర్ పాల్గొన్నారు.



గానుగుపహాడ్‌లో మాట్లాడుతున్న ప్రేమలతారెడ్డి

### హమాలీ కార్మికులకు బోనస్ డబ్బులు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : మిల్లులో పనిచేసే హమాలీ కార్మికులకు దీపావళి బోనస్ డబ్బులు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ అజయ్‌సారథి అన్నారు. బుధవారం పట్టణంలోని గిల్డ మోడ్రన్ దాల్ ఆయిల్ మిల్ గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మిల్లుల యజమాన్యం కార్మికులకు దీపావళి బోనస్ ఇచ్చినప్పటికీ, గిల్డ మోడ్రన్ దాల్ ఆయిల్ మిల్లు మాత్రం లేబర్ ఆఫీస్ నుంచి వస్తాయనడం సరికాదన్నారు. వెంటనే బోనస్ డబ్బులు అందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. నవీన్, నరసింహ, శ్రావణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### 800 కిలోల బెల్లం, 100 కిలోల పటిక పట్టివేత

దంతాలపల్లి, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని వరంగల్-ఖమ్మం రహదారిపై అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను తొర్రూర్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై రవళీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి నర్సింహులపేట మండలం పెద్దనాగారానికి కారు, బైక్‌పై నల్లబెల్లం, పటిక తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో బుధవారం దంతాలపల్లి శివారులో 800 కేజీల బెల్లం, 100 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నారు. కారు, బైక్‌ను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లం, పటికతో వెళ్తున్న కారును పట్టుకున్న తొర్రూరు ఎక్సైజ్ పోలీసులు